

ప్రజా న్యూస్

— నెట్‌వర్క్ —

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 178,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,శనివారం, తేదీ : 31-10-2026

విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం



- నిర్మాణంలో ఉన్న కన్వేయర్ బెల్ట్‌కు అంటుకున్న మంటలు
- వెల్డింగ్ పనుల వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

అమరావతి : విశాఖ పోర్టు ట్రస్ట్ పరిధిలో ఈ మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సీ హార్స్ జంక్షన్ సమీపంలో ఉన్న జేఎం భక్షి కంపెనీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఓ కన్వేయర్ బెల్ట్‌కు మంటలు అంటుకున్నాయి.

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా
దేశం కష్టాల్లో ఉంటే కొందరు సంతోషిస్తున్నారు

- దేశానికి అత్యంత బలమైన స్తంభాల్లో అన్నదాతలు ఒకరని ప్రధాని మోదీ అన్నారు.
- గుజరాత్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.



ఢిల్లీ : దేశానికి అన్నదాతలే మూల స్తంభాలని, తన చివరి శ్వాస వరకు ప్రజా సేవలో పునరంకితమవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన గుజరాత్ లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు రూ.14,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 'నా జీవితంలో చివరి క్షణం వరకు ప్రజల సేవలోనే నిమగ్నమై ఉంటాను. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి, కుటుంబంలోని ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచ్‌గా కూడా ఎవరూ పనిచేయని నేపథ్యం ఉన్న నాకు, మీరు మొదట గుజరాత్‌కు, ఆ తదనంతరం భారతావనికి మిగతా..2లో

యూపీలో మరోసారి అధికారంలోకి వస్తాం
యూసీసీని అమలు చేస్తాం

- ఉత్తరప్రదేశ్‌లో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.
- ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు.



ఢిల్లీ : ఉత్తరప్రదేశ్ లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మిగతా..2లో

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

హైదరాబాద్:రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన



హైదరాబాద్ : మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు మిగతా..2లో

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు
పాల్పడితే ఉపేక్షించం



- ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ పడేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.
- కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు ప్రభుత్వానికి దక్కిన వరుస న్యాయ విజయాలు అని పేర్కొన్నారు.

హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ పడేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు ప్రభుత్వానికి దక్కిన వరుస న్యాయ విజయాలు అని పేర్కొన్నారు. కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూల తీర్పు వచ్చిందని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈరోజు (శుక్రవారం) మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు.

ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి: హోం మంత్రి అనిత



ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఆయా గ్రామాల్లో రోడ్లు వేశామని.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా, అక్టోబరు 30 : ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఆయా గ్రామాల్లో రోడ్లు వేశామని.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత సుడిగాలి పర్యటన చేశారు. యస్ రాయవరం, పాయకరావుపేట మండలాల్లో పలు గ్రామాల్లో స్థానిక సంస్థల మిగతా..2లో

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు



గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు

కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ

విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ

హైదరాబాద్: మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మిగతా..2లో

మత్స్యకారుల సమస్యలకు
శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి



తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు.

అమరావతి, అక్టోబరు 30 : తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈరోజు (శుక్రవారం) కాకినాడ జిల్లాపై ఆర్నబ్ తుఫాన్ ప్రభావం, సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగంతో, తీర ప్రాంత గ్రామాల ప్రజలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు డిప్యూటీ సీఎం కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా..

నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం
ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాం

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటించారు.
- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మెట్రేవుల్లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు.
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటన
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటన



అమరావతి : అర్నబ్ తుపాను మృతులకు 5 లక్షల రూపాయల తక్షణ సాయం అందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విపత్తును ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడం వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామని చెప్పారు. పునరుద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్న ముఖ్యమంత్రి, నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు సీఎం చంద్రబాబు పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మెట్రేవుల్లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. పునరావాస కేంద్రంలో భోజన వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులు తమకు సౌకర్యాలన్నీ కల్పిస్తున్నారని మిగతా..2లో

సీఎం పర్యవేక్షణతో
పెను నష్టం తప్పింది



- అర్నబ్ తుపాను నష్టంపై అమలాపురంలో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
- జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఈ రాత్రికే 100 శాతం విద్యుత్ పునరుద్ధరించాలని లక్ష్యం
- తుపానుకు సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు, 36 సబ్‌స్టేషన్లు ధ్వంసం

అమరావతి : అర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను చక్కదిద్దే పనులను ప్రభుత్వం ముమ్మరం చేసింది. మున్సిపాలిటీల పరిధిలో

మొదటి పేజి తరువాయి

సీఎం పర్యవేక్షణతో పెను నష్టం తప్పింది: మంత్రి అచ్చెన్నాయుడు

ఈ రాత్రిలోగా 100 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అమలాపురంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో ఆయన తుపాను నష్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అర్నాబ్ తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందునుంచీ నిరంతరం పర్యవేక్షించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని చెప్పారు. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లకుండా ఆపడం వంటి చర్యలు సత్ఫలితాలనిచ్చాయన్నారు. అయితే, విద్యుత్ శాఖకు ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లిందని, జిల్లావ్యాప్తంగా సుమారు 8,000 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 36 సబ్‌స్టేషన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. పునరుద్ధరణ పనులకు అవసరమైన సిబ్బంది, సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. గురువారం క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి... తక్షణమే తెలంగాణ నుంచి 1,000 మంది సిబ్బందిని రప్పించారని చెప్పారు. అలాగే, తమిళనాడు ప్రభుత్వంతో చర్చించి అక్కడి నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి: హోం మంత్రి అనిత

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌లను చూసి.. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. అద్దరోడ్డు నుంచి నర్సీపట్నం రోడ్డును పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్, టాయ్ పార్క్ లాంటి పరిశ్రమలు వచ్చాయని వివరించారు. టాయ్ పార్క్‌తో 25 వేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పుకొచ్చారు. గోదావరి జలాలు పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలని హోం మంత్రి అనిత కోరారు.

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి

వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని స్పష్టం చేశారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మత్స్యకారుల సమస్యలపై స్వయంగా తాను అధ్యయనం చేస్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించం

తాజాగా మియాపూర్ భూముల విషయంలోనూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం వరించిందని తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడుతాం..

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రెవెన్యూ, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వయంతో న్యాయపోరాటం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పాత భూ రికార్డులు, రెవెన్యూ ఆధారాల పరిశీలనతో ప్రభుత్వ హక్కులను పరిరక్షిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు.. రాష్ట్ర ప్రజల ఉమ్మడి ఆస్తి అని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. న్యాయపోరాటంలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులకు మంత్రి అభినందనలు తెలిపారు. భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను కాపాడుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు. సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

విశాఖ పోర్టులో అగ్నిప్రమాదం

ఈ ఘటనతో పోర్టు సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో కన్వేయర్ బెల్ట్‌పై ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటంతో పాటు, దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. సమాచారం అందుకున్న వెంటనే విశాఖ పోర్టు ట్రస్ట్ అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కన్వేయర్ బెల్ట్ వద్ద జరుగుతున్న వెల్డింగ్ పనుల కారణంగా చెలరేగిన నిప్పురవ్వలే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై పోర్టు అధికారులు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం - ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాం

మొదటి పేజి తరువాయి

గ్రామస్థులు తెలపగా, ధైర్యంగా ఉండాలని అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం వారికి భరోసా ఇచ్చారు. తుపాను నష్టాలు ఒక్కొక్కటీ పరిష్కరిస్తున్నామన్నారు. బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తామని, బోట్లు కోల్పోయిన మత్స్యకారులను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం నివారణ : తుపాను తీవ్రతను ముందే గుర్తించి అప్రమత్తం చేయడం వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఇబ్బందులు తప్పాయన్నారు. కూలిన చెట్ల తొలగింపు వేగంగా జరుగుతుందని విద్యుత్ స్తంభాలను చురుగ్గా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ నుంచి వచ్చిన సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో పాలుపంచుకుంటున్నట్లు వివరించారు. రేపు సాయంత్రం లేదా ఎల్లుండినాటికి జిల్లాలో ప్రతి ఇంటికీ విద్యుత్ పునరుద్ధరిస్తామన్నారు. గ్రామాల్లో చివరి వ్యక్తికీ సాయం అందే వరకు పర్యవేక్షిస్తానని చెప్పారు. రూ.4,600 కోట్ల నష్ట



పరిహారం : తుపాను నష్టాన్ని ఇప్పటికే కేంద్రానికి నివేదించామని సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్రమంత్రి అమిత్‌షా సానుకూలంగా స్పందించారని అన్నారు. నిన్న రూ.4,600 కోట్ల నష్ట పరిహారంతో మెమోరాండం పంపించామని తెలిపారు. సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకునేలా ప్రయత్నాలు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుపాను వర్షాల వల్ల అన్ని రిజర్వాయర్లు నీళ్లతో నిండాయని చెప్పారు. రైతులు పంటలు వేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. విపత్తులో పనిచేసిన ఉద్యోగులందరినీ సీఎం చంద్రబాబు అభినందించారు. కష్టకాలంలో వారందించిన సేవలను ప్రజలంతా గుర్తు పెట్టుకుంటారని అన్నారు. "తుపాను వర్షాల వల్ల అన్ని రిజర్వాయర్లలో నీళ్లు నింపాం. మళ్లీ పంటలు వేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. తుపాను నష్టంపై కేంద్రమంత్రి అమిత్‌షా సానుకూలంగా స్పందించారు. నిన్న రూ.4,600 కోట్ల నష్ట పరిహారంతో మెమోరాండం పంపించాం. తుపాను మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల తక్షణ సాయం. ఇళ్లలో నీళ్లు చేరి పాక్షికంగా దెబ్బతింటే రూ.10 వేలు ఆర్థిక సాయం చేస్తాం. ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల చెరువులు తెగలేదు. తుపాను వల్ల ప.గో. జిల్లాలో కూలిన 12,500 చెట్లను తొలగించాం. ప.గో. జిల్లాలో కూలిన 4,500 విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. రెండు జిల్లాల్లో కొబ్బరి చెట్లు, వరి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులకు సహాయం చేసి ఆదుకునే ప్రయత్నం చేస్తాం."

ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా- దేశం కష్టాల్లో ఉంటే కొందరు సంతోషిస్తున్నారు

మొదటి పేజి తరువాయి


సేవ చేసే గొప్ప బాధ్యతను, అవకాశాన్ని అప్పగించారు. నేను సాధించిన ప్రతి విజయానికి, పొందిన ప్రతి పురోగతికి మూలం దేశ ప్రజలే. ఈ దేశ ప్రజల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. జీవితాంతం వారికి రుణపడి ఉంటాను' అని మోదీ అన్నారు.

విపత్తుల వేళ దుష్ప్రచారం

పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వేళ ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశం ఏదైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ఆనందించే మనస్తత్వం ఉన్న కొందరు వ్యక్తులు మన మధ్యే ఉన్నారని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం తలెత్తిన సమయంలో దేశంలో తీవ్రస్థాయిలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంటగ్యాస్ సరఫరా నిలిచిపోతుందంటూ కావాలని పుకార్లు సృష్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే ఏకైక లక్ష్యంగా ఈ అసత్య ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు ఆకాశాన్నంటినప్పటికీ, ఆ ధరల భారాన్ని భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం ఆ ఖర్చును భరించిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "దేశంలోని ప్రతి రైతు, యువకుడు, ఆడబిడ్డ 'వికసిత భారత్' నిర్మాణ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. కానీ దురదృష్టవశాత్తు ఇది కొందరికి నచ్చటం లేదు. దేశం కష్టాల్లో ఉంటే చూడాలనుకునే వాళ్లు దేశంపైకి ఏదైనా ఆపద వస్తే వారికి ఎంతో ఆనందం. ఇరాన్, గల్ఫ్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధమే దీనికి తాజా ఉదాహరణ. ఈ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సమైక్యంగా సన్నద్ధమవుతుంటే.. వీళ్లు మాత్రం పదంతులు వ్యాప్తి చేయడంలో బిజీగా ఉన్నారు. కావాలనే తప్పుడు ప్రచారాలు సృష్టించారు. రైతులకు ఎరువులు దొరకవని భయపెట్టారు. కృత్రిమంగా క్యూలైన్లు సృష్టించి వాతావరణాన్ని చెడగొట్టారు. ఇకపై గ్యాస్ సిలిండర్లు దొరకవని మహిళలను భయపెట్టారు. దేశంలో అశాంతి, గందరగోళం సృష్టించడమే వారి లక్ష్యం"

ప్రధాని మోదీ రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆసరాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా రూ. 4.5 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని



పెంపొందించడం, పశుసంవర్ధక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజం అందిస్తున్నామని తెలిపారు. బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రధాని ప్రత్యేకంగా మోదీ కొనియాడారు. ఇక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని చెప్పారు. బనాస్కాంత ప్రాంతంలో పండే బంగాళాదుంపలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. ఇక్కడి రైతు వద్దకు వచ్చి 'మేము బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేసి ఇస్తాం' అని చెప్పే ధైర్యం ఎవరూ చేయలేరన్నారు. ఎందుకంటే, తమ కష్టంతో బంగాళాదుంపల ద్వారా బంగారాన్ని ఎలా పండించాలో ఇక్కడి రైతులకు బాగా తెలుసని చెప్పారు.

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి



లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

యూపీలో మరోసారి అధికారంలోకి వస్తాం- యూసీసీని అమలు చేస్తాం

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు.

మమ్మల్ని ఎవరూ కదిలించలేరు!

ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు. "యూపీలో బీజేపీ ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ కదిలించలేరు. బీజేపీ మళ్లీ యూపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని పేర్కొన్నారు. మరోవైపు సమాజ్ వాదీ పార్టీ ఇకపై యూపీలో అధికారంలోకి రాదని అమిత్ షా అన్నారు. "అఖిలేశ్ బాబూ, గుర్తుంచుకోండి. వచ్చే 30 ఏళ్ల వరకు మీ పార్టీ ఉత్తరప్రదేశ్ లో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ప్రజలు మీ మూడో తరానికి కూడా క్షమించరు" అని అన్నారు. ఈ సందర్భంగా 1990 అక్టోబర్ 30న అయోధ్యలో కరసేవకులపై పోలీసులు జరిపిన కాల్పులను అమిత్ షా ప్రస్తావించారు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం పోరాడుతున్న కరసేవకులపై సమాజ్ వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులు కాల్పులు జరిపారని ఆయన గుర్తు చేశారు. "నేను (సమాజ్ వాదీ పార్టీ) వారిని అడగాలని అనుకుంటున్నాను. ఏ ప్రాతిపదికన మీరు ప్రభుత్వం ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారు? మీరు రామభక్తులపై కాల్పులకు ఆదేశించారు. కానీ మేము రామమందిరాన్ని నిర్మించాం" అని పేర్కొన్నారు.

ఓటు చోరీపై ఏమన్నారంటే?

మరోవైపు విపక్షాలు చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలపై కూడా అమిత్ షా మండిపడ్డారు. వారిని మ్యాచ్ ఓడిపోయిన తర్వాత అంపైర్



ను నిందించే జట్టుతో పోల్చారు. "మ్యాచ్ ఓడిపోయిన తర్వాత, వాళ్లు అంపైర్ ను నిందిస్తున్నారు. ఓట్ చోరీ జరిగిందని ఆరోపిస్తున్నారు. పార్లమెంట్ లో ఈ అంశంపై చర్చకు బీజేపీ సిద్ధంగా ఉంది. ఈ రోజే వచ్చి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోనివ్వండి. మేము ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పడానికి సిద్ధంగాఉన్నాం. పార్లమెంట్ లో చర్చ జరగనివ్వండి" అని అన్నారు. కాగా, ఈ రోజు ఉత్తరప్రదేశ్ లోని డాక్టర్ రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అమిత్ షా ప్రారంభించారు. తమ పార్టీ సిద్ధాంతకర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు ఆయన పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ , ఉపముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్ , కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిపై చర్చ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా యూసీసీని అమలు చేయాలని పలు రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు పిలుపునిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా కూడా యూసీసీ అమలు గురించి మాట్లాడడం గమనార్హం. ఇటీవల అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దేశవ్యాప్తంగా యూసీసీ అమలు చేయాలని పిలుపునిచ్చారు. యూసీసీ లేకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్న వారిలో ముస్లిం మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. బహుభార్యత్వం లాంటి సమస్యలను పరిష్కరించడానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసోంలో ఇప్పటికే యూసీసీని నోటిఫై చేశామని ఆయన గుర్తు చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ కూడా యూసీసీ ప్రస్తుతం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. చట్టంలో ఏకరూపత తీసుకురావడానికి కేంద్ర పౌరస్మృతి ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇటీవల మాట్లాడుతూ, ఉత్తరాఖండ్ , గుజరాత్ ల తరహాలో తమ ప్రభుత్వం 6నెలల్లోగా లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు ప్రవేశపెట్టి, రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తామని ప్రకటించారు. అంతేకాదు బంగాల్ కోసం ఏకరూప పౌరస్మృతి ముసాయిదాను పరిశీలించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. బంగాల్ సర్కార్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం, యూసీసీ ద్వారా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించిన విషయాల్లో అన్ని వర్గాల వారికి సమానంగా పౌరచట్టాలను వర్తింపజేస్తారు.

బంధం బెడిసికొట్టిన తర్వాత అత్యాచారం కేసు పెట్టలేరు

వ్యక్తిగత సంబంధాలు విఫలమైనప్పుడు వాటిని క్రిమినల్ రంగు పులిమి అత్యాచారం కేసులుగా మార్చడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ప్రేమ లేదా పరస్పర అంగీకారంతో కూడిన సంబంధాలు విఫలమైన తర్వాత, గతంలో సమ్మతితోనే జరిగిన శారీరక సంబంధాన్ని ఆ తర్వాత అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంబంధాలు బెడిసికొట్టిన తర్వాత వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతోందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగా అత్యాచారం, బలవంతం లేదా మోసంతో సమ్మతి పొందిన సందర్భాల్లోనే అత్యాచారం ఆరోపణను పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేస్తూ కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం అభియోగాల నుంచి సుప్రీం కోర్టు విముక్తి కల్పించింది.

సంబంధం విఫలమైతే అత్యాచారం కేసు పెట్టలేరు

జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన సంబంధంలో శారీరక సాన్నిహిత్యం ఏర్పడిన తర్వాత, ఆ సంబంధం విఫలమైందనే కారణంతో దానిని అత్యాచారంగా చిత్రీకరించలేమని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి కేసుల్ని తాము పదే పదే చూస్తున్నామని, విఫలమైన సంబంధాలు ఆ తర్వాత క్రిమినల్ కేసులుగా మారుతున్న ఈ ధోరణి సమాజంలో పెరిగిపోతోందని, ఇది ఆందోళనకరం అని వ్యాఖ్యానించింది. అత్యాచారం, మోసం అనే రెండు ఆరోపణల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అత్యాచారం తీవ్రమైన నేరం అని, కానీ ఇలాంటి కేసుల వల్ల నిజంగా లైంగిక వేధింపులు,



అత్యాచారానికి గురైన బాధితుల కేసుల తీవ్రత తగ్గిపోతోందని కోర్టు హెచ్చరించింది. గతంలో అంగీకారంతో జరిగిన సంబంధాన్ని, తర్వాత విడిపోయారనే కారణంతో నేరంగా మార్చడం సరికాదని స్పష్టం చేసింది. "పరస్పర సమ్మతితో సాగిన ఒక బంధం విఫలమైనంత మాత్రాన, ఆ తర్వాత కలిగే పశ్చాత్తాపం లేదా కోపం ఆధారంగా ఆ సంబంధాన్ని నేరంగా పరిగణించలేం. ప్రతి విఫలమైన సంబంధాన్ని నేరంగా చిత్రీకరిస్తే, అసలైన లైంగిక దాడి కేసుల తీవ్రత దెబ్బతింటుంది. నిజమైన లైంగిక హింస, భయపెట్టి లేదా మోసం చేసి అత్యాచారం చేసిన సందర్భాలకు మాత్రమే చట్టాన్ని వర్తింపచేయాలి."

- జస్టిస్ బి.వి. నాగరత్న, సుప్రీం కోర్టు న్యాయమూర్తి

పురుషుడికి సంబంధం నుంచి వైదొలిగే హక్కు లేదా?

విడిపోయిన తర్వాత ఒకరి కోపం కారణంగా మరొకరిని నేరస్థుడిగా చిత్రీకరించలేమని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. అలాంటి విధానం నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తుందని పేర్కొంది. సమ్మతితో కూడిన బ

కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో గరికపాటి వారి ప్రవచనాలు.

అందరూ ఆహ్వానితులే.

నవంబర్ 31 వ తారీఖున పాఠశాలలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం

దేవరకొండ,అక్టోబర్ 30. జెట్టి శంకర్ యాదవ్ ప్రజా న్యూస్.

దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ లో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సహస్ర అవధాని, పద్మశ్రీ అవార్డు గ్రహీత సనాతన ధర్మం హిందూ ధర్మం గూర్చి అనర్గళంగా మాట్లాడగలిగే ప్రవచనా కర్త శ్రీ గరికపాటి నరసింహ రావు ప్రవచనాల కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపల్ రాజకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ విద్యార్థుల దశలో సరైన మార్గంలో నడిపించుటకు గరికపాటి వారి ప్రవచనాలు వ్యక్తిత్వ వికాసం దూరదృష్టి జీవితంలో మార్పు, విద్యార్థ దశ నుండి విజేతగా గెలుపొందడానికి సులువైన మార్గాలు వంటి అంశాలను గరికపాటి వారి ప్రవచనాలు ద్వారా తెలుసుకోవాలని తెలిపారు. విద్యార్థులు గరికపాటి వారి ప్రవచనాలను విని విజేతలుగా మారాలని భవిష్యత్తులో మంచి మార్గాలను ఎంచుకోవాలని గరికపాటి వారి ప్రవచనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు కార్యక్రమానికి నర్సరీ టు పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, మరియు 8,9,10 తరగతుల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నట్లు పాఠశాల యాజమాన్యం ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.



విద్యుత్ అక్రమ కనెక్షన్లు తీసివేసి విద్యుత్ను ఆదా చేయండి.

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్.

కుత్బుల్లాపూర్. అక్టోబర్.30 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..



గాజులరామారంలోని ప్రభుత్వ భూములలో వెలిసిన అనేక అక్రమ బస్తీలలో ఉన్నటువంటి గృహాలకు ఎటువంటి విద్యుత్ కనెక్షన్ లేకుండా కేవలం వైర్ల ద్వారా విద్యుత్ పొందుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని అలాంటి కనెక్షన్లను గుర్తించి తొలగించి విద్యుత్ హోదా చేయాల్సిందిగా నేడు సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో గాజులరామారం సబ్ ఇంజనీర్ సునైనా కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజులరామారంలోని ప్రభుత్వ భూములు కబ్జాదారులు కబ్జాలు చేసి అనేక వందల ఇండ్లను నిర్మించి కొన్నింటికి ఎలాంటి విద్యుత్ మీటర్లు లేకుండా నీటికి విద్యుత్తును పొందుతున్నారని ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో నీరు లేకపోవడం వల్ల విద్యుత్తు తగినంతగా ఉత్పత్తి లేకపోవడం వల్ల విద్యుత్తును కూడా ఆదా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్న సందర్భంలో ఇక్కడి విద్యుత్ అధికారులు మరియు సిబ్బంది విద్యుత్ చౌర్యాన్ని అడ్డుకొని విద్యుత్తును ఆదా చేయాల్సిన బాధ్యత ఉందని కావున భారత కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన ఫిర్యాదుకు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు కోశాధికారి సదానంద యువజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ సిపిఐ నాయకులు నర్సింహులు శ్రీనివాస్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి కోమటిరెడ్డి

- దివంగత ఈనాడు జర్నలిస్ట్ దత్తురెడ్డి భార్యకు న్యాక్ లో ఉద్యోగం

- ఇచ్చిన మాట ప్రకారం జర్నలిస్ట్ కుటుంబానికి అండగా నిలిచారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు.

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 30: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

ఈనాడు జర్నలిస్ట్ దివంగత దత్తురెడ్డి భార్యకు న్యాక్ లో అసిస్టెంట్ ఇన్స్ట్రక్టర్ ఉద్యోగం ఇప్పించారు. ఈనాడు జర్నలిస్టు దత్తురెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందగా.. అప్పుడు కామారెడ్డి జిల్లాలోని వారి స్వగ్రామం వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి, 4 లక్షలు అందజేసిన మంత్రి, దత్తురెడ్డి భార్య ప్రియాంకకు తన శాఖ పరిధిలో ఉద్యోగం ఇప్పిస్తానని నాడు హామీ ఇచ్చారు.ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డిలో ఉద్యోగం ఇప్పించారు. ఉద్యోగాన్ని పర్మినెంట్ చేస్తామని ప్రియాంకకు భరోసానిచ్చిన మంత్రి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.మంత్రికి ధన్యవాదాలు తెలిపిన దత్తురెడ్డి భార్య, కుటుంబ సభ్యులు. ఈనాడు జర్నలిస్ట్ దత్తురెడ్డి కుటుంబానికి ఇచ్చిన మాట ప్రకారం అండగా నిలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపి, హర్షం వ్యక్తం చేసిన పలువురు జర్నలిస్టులు.



ఏపీకి మిర్యాలగూడ డివిజన్ విద్యుత్ సహాయక బృందాలు

మిర్యాలగూడ అక్టోబర్ 30 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ: ఆంధ్రప్రదేశ్ లో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు తెలంగాణ విద్యుత్ సంస్థ సహాయక బృందాలను పంపింది.
టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జితేష్ పాటిల్, ఐఏఎస్ ఆదేశాల మేరకు, నల్గొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ డివిజన్ నుండి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.
తుఫాన్ కారణంగా ఏపీలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి ప్రత్యేక వాహనాలు, అత్యాధునిక బ్యాటరీ ట్రీ ప్రూనర్లు, అత్యవసర పరికరాలతో మిర్యాలగూడ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ఈరోజు తెల్లవారుజామున బయలుదేరారు. ఉన్నతాధికారులు జెండా ఊపి బృందాల వాహనాలను ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆచారి, డివిజన్ ఏడీఈలు తిరుపతయ్య, కోడిరెక్క రవికుమార్, ఇందిరా, ఏఈలు వినోద్ కుమార్, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జానయ్య, కృష్ణారెడ్డి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు మారం శ్రీనివాస్, వీరభద్రం, ఎల్లయ్య చారి, బిక్షం, జలంధర్, భాస్కర్, సతీష్, వెంకటరత్నం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తుని మున్సిపాలిటీని కూటమి గెలుస్తుంది: యనమల దివ్య

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం..

పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించిన ప్రభుత్వ విప్

తుని, అక్టోబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
తుని మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే నమ్మకం ఉందని ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. మున్సిపాలిటీని కూటమి సునాయాసంగా కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల బరిలో ఉన్న కూటమి అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తునిలోని కూటమి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి శ్రీలత, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, జనసేన నాయకులు బార్లపూడి క్రాంతి, తోట సుధీర్, రామ్ కుమార్, వెలుగుల గోపాలకృష్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశీస్సులతో స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని యనమల దివ్య పేర్కొన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా గత రెండున్నరేళ్లలో తుని పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు కృషి చేశామని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించిన ఓటర్లు కూటమికి మద్దతుగా నిలుస్తున్నారని ఆమె అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, సూరంపూడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

2, 3, 4 వార్డుల్లో యనమల దివ్య ప్రచారం

తుని మున్సిపాలిటీలోని 2, 3, 4 వార్డుల కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రభుత్వ విప్ యనమల దివ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ వార్డుల్లో పర్యటిస్తూ ఓటర్లను నేరుగా కలుసుకున్నారు. కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని యనమల దివ్య అన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాల ద్వారా పేద కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి బాటలు వేశామని తెలిపారు. భవిష్యత్తులోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆమె పేర్కొన్నారు.





విశాఖ పోర్టులో భారీ అగ్నిప్రమాదం..

కన్వేయర్ బెల్టులో చెలరేగిన మంటలు..బి విశాఖ పోర్టులో ఒక్కసారిగా కలకలం,

విశాఖపట్నం, అక్టోబర్ 30: ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు.
విశాఖ పోర్టు ట్రస్ట్‌లోని సీ హార్స్ జంక్షన్ సమీపంలో అగ్నిప్రమాదం.. జె . ఎం. భక్షి కంపెనీ పరిధిలో ఐరన్ ఓర్ రవాణా చేసే కన్వేయర్ బెల్టులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు.. మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన సిబ్బంది. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.మంటలను అదుపులోకి తెచ్చేందుకు కొనసాగుతున్న అగ్నిమాపక చర్యలు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.. ప్రమాదంలో జరిగిన నష్టం, ఎవరైనా గాయపడ్డారా అనే వివరాలు వెల్లడి కావాల్సి ఉంది..



చౌటకూర్‌లో అభివృద్ధి పనుల రథయాత్ర ప్రారంభం.

- మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి.

- గ్రామ సర్పంచ్ పర్కల రామ్ రెడ్డి.





ప్రజా న్యూస్ అక్టోబర్ 30 (అందోల్ ప్రతినిధి మహమ్మద్ అభిద్)
చౌటకూర్ మండలంలోని 14 గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకు ఏర్పాటు చేసిన రథయాత్రను మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో సుమారు రూ.2,000 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. చౌటకూర్ సర్పంచ్ పర్కాల రాంరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో రథయాత్ర నిర్వహించి, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్కుల రాంరెడ్డి,మాజీ ఉప సర్పంచ్ రామా గౌడ్, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యుల జైపాల్ రెడ్డి, గోరేమియా, పేట గంగారం, , కరోబార్ కుమార్ గౌడ్, మల్లేశం, దమ్మి కిట్టు, చక్రపాణి, రాజేశ్వర్ గౌడ్, మల్లికార్జున్, బాలు, నవీన్, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

బాలల భద్రతపై పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 30 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..



సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలోని పలు పాఠశాలల్లో బాలల హక్కులు, భద్రత, బాలలపై జరిగే నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో పోక్సో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి శ్రీమతి శ్రీలేఖ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వి.ఆర్. తేజో కార్తీక్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ధనలక్ష్మి, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి. దుర్గారాణి వివిధ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గుడ్ టచ్‌బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, ఆన్‌లైన్ భద్రత, పోక్సో చట్టం, బాలల హక్కులు తదితర అంశాలను వివరించారు. ఎలాంటి వేధింపులు లేదా అసురక్షిత పరిస్థితులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.ప్రతి బాలుడికి, బాలికకు సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని, బాలల రక్షణకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని న్యాయాధికారులు పేర్కొన్నారు.

ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహను జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి కుమార్తె వివాహానికి ఆహ్వానించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.



ప్రజా న్యూస్ అక్టోబర్ 30 అందోల్ ప్రతినిధి (మహమ్మద్ అభేద్)
ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించాలని కోరుతూ మంత్రికి స్వయంగా శుభలేఖను అందజేసి ఆహ్వానించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆమెను సాదరంగా స్వాగతించి, కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. వివాహ వేడుకకు హాజరయ్యేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు

పాయకరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాం: హోం మంత్రి అనిత

పరిశ్రమలు, వ్యవసాయం, సంక్షేమానికి ప్రాధాన్యం.. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



పాయకరావుపేట, అక్టోబర్ 30 ప్రజా న్యూస్ నెట్వర్క్:

పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న నమ్మకం, ఆదరణకు ఎప్పటికీ రుణపడి ఉంటానని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రజల సహకారంతో గత రెండున్నరేళ్లలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ వివరాలను వెల్లడిస్తూ ఆమె ఒక వీడియో విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో పాయకరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని అనిత పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ముఖద్వారంగా ఉన్న పాయకరావుపేట ప్రాంతం పారిశ్రామికంగా ముందుకు సాగుతోందన్నారు. నక్కపల్లిలో ఏఎంఎన్ఎస్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్, టాయ్ పార్క్ వంటి పరిశ్రమలు రావడం సంతోషకరమని తెలిపారు. గతంలో ఉద్యోగాల కోసం స్థానిక యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి కూడా ఉద్యోగాల కోసం పాయకరావుపేటకు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు. వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగానికి కూడా ప్రాధాన్యం ఇస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకురావాలన్నది తమ కల అని అనిత అన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమించి గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల అభివృద్ధికి కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పిస్తున్నామని హోంమంత్రి వివరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, స్త్రీశక్తి, అన్న క్యాంటీన్లు, మత్స్యకార సేవలో, నేతన్న సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో వంటి పథకాలతో వివిధ వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారికి మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా వచ్చే వేసవి నాటికి ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇచ్చి గెలిపించాలని అనిత విజ్ఞప్తి చేశారు. తనకు గతంలో అందించిన ఆదరణనే కూటమి అభ్యర్థులకు కూడా అందించాలని కోరారు. టీడీపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై, జనసేన అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తుపై, బీజేపీ అభ్యర్థులకు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో భరోసా, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు



(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 30 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
సంగారెడ్డి పట్టణంలోని వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో భరోసా మరియు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రాములు, గోప్య నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.భరోసా సహాయకురాలు మహేశ్వరి మాట్లాడుతూ బాలికల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, మైనర్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మహమూద్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ మహమూద్ అలీ, ఏఎన్ఎం కళాశాల చైర్మన్ సూర్య కిరణ్, ప్రిన్సిపల్ లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపల్ సభా ఫాతిమా, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల ఎంపీటీసీ2 స్థానంలో కూటమి అభ్యర్థి ఆంజనేయులుకు మద్దతుగా ముమ్మర ప్రచారం

- ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

- భారీగా పాల్గొన్న కూటమి శ్రేణులు.. ప్రచారంతో హోరెత్తిన గ్రామంలోని పలు వార్డులు







తలుపుల, అక్టోబర్ 30,ప్రజా న్యూస్ నెట్వర్క్:

తలుపుల మండలంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. తలుపుల ఎంపీటీసీ2 స్థానం నుంచి కూటమి తరఫున భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తలుపుల ఆంజనేయులుకు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి తలుపుల ఆంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని పలు వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఇంటింటి ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచారంలో పాల్గొంటూ కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ, కూటమి అభ్యర్థి ఆంజనేయులుకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. స్థానిక ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆదరాభిమానాలు, ఆశీర్వాదాలతో ఎన్నికల బరిలో విజయం సాధిస్తాననే నమ్మకాన్ని అభ్యర్థి వ్యక్తం చేశారు.ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని, అదే ఐక్యతను స్థానిక ఎన్నికల్లోనూ కొనసాగిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తలుపుల ఎంపీటీసీ2 స్థానం అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యంగా అభ్యర్థి ఆంజనేయులుకు మద్దతుగా నిలవాలని ఓటర్లను కోరారు.ముఖ్యంగా అశోక్ నగర్‌కు చెందిన ఆంజనేయులు స్థానిక ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటంతో ప్రచారంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో కూటమి నాయకులు నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి మంచి స్పందన లభిస్తోందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, యువకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆంజనేయులుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మూడు పార్టీల శ్రేణులు కలిసికట్టుగా ప్రచారంలో పాల్గొనడంతో తలుపుల ఎంపీటీసీ2 ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.కూటమి అభ్యర్థి ఆంజనేయులు విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగుతూ ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు.


ఈరోజు జోగిపేట యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ 18 వసంతాలు నింపుకున్న సందర్భంగా నూతనంగా వచ్చిన మేనేజర్ ఆదిత్య కుమార్ కు వైస్ చైర్మన్ చిట్టిబాబు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది



(ప్రజా న్యూస్ అక్టోబర్ 30 అందోల్ ప్రతినిధి మహమ్మద్ అదేద్)
ఖాతాదారులకు ఉన్నత విలువలతో కూడిన బ్యాంకు సిబ్బంది సేవలు అందిస్తూ అలాగే రైతులకు క్రాఫ్ లోన్లు సకాలంలో అందజేయాలని అలాగే ఎస్సీ, బీసీ బడుగు బలహీన వర్గాలకు వచ్చే సబ్సిడీ లోన్లను వారికి తప్పకుండా అందజేయాలని పెన్షనర్లకు సకాలంలో పెన్షన్లు అందజేయాలని యూనియన్ బ్యాంక్ అనేది అన్ని బ్యాంకుల కన్నా ముందు ఉండేటటువంటి అన్ని ప్రయోజనాలను పొందాలని ఎక్కువ ఖాతాదారులను యూనియన్ బ్యాంకు లో జమ చేసుకొని నంబర్వన్ బ్యాంకు గా ఆవిర్భావించాలన్నదే మా అందరి కోరిక నిజంగా నాలుగు నెలల కాలంలోనే యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆదిత్య సార్ గారు అందరి మన్ననలు పొందడం మనసులు గెలుచుకోవడం ఖాతాదారులకు ఇబ్బందులు పెట్టకుండా అన్ని రకాలుగా సేవలు అందిస్తూ అటు మేనేజర్గా ఇటు సిబ్బందితో కలుపుగోలుగా ఉంటూ యూనియన్ బ్యాంకు ను ముందుకు తీసుకుపోతున్నారన్న విషయంలో సందేహం లేదు . ఈరోజు జోగిపేట యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ 18 వసంతాలు నిండిన సందర్భంగా బ్యాంకు మేనేజర్ గారికి బ్యాంకు సిబ్బందికి అందరికీ పేరుపేరునా శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణ రెడ్డి గారు వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) గారు మాజీ ఎంపీపీ హెచ్ రామ గౌడ్ గారు సీనియర్ జర్నలిస్ట్ ఆకుల రాంబాబు గారు రవీందర్ గారు సతీష్ గారు అరుణ్ గారు రాజు ఇంకా ఇతరులు పాల్గొనడం జరిగింది.

గుర్రంపోడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎమ్మార్వో,ఏవో గారికి వినతి పత్రం ఇచ్చిన... బిఆర్ఎస్ మండల నాయకులు

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో గుర్రంపోడు మండలం లేకపోవడంతో, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గుర్రంపొడు ఎమ్మార్వో మరియు వ్యవసాయ అధికారి గారికి వినతిపత్రం ఇచ్చి తక్షణమే మండలాన్ని కరుమండలంగా ప్రకటించాలని కోరారు...



(శీష్ - 30 ప్రజా న్యూస్ రిపోర్టర్)
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్రంపోడు మండలంలో రైతులు పంటలు ఎండిపోయి పంట చేతికి అందక మండలంలో 70 శాతం మంది రైతులు, వరి సెను,పత్తి పంటలు, బత్తాయి తోటలు ఎండిపోయి నష్టపోయారు, వారికి తక్షణమే ఎకారాకు 50,000 ఇచ్చి ప్రభుత్వశే ఆదుకోవాలని కోరారు, మండలాన్ని కరువు మండలం గా ప్రకటించకుంటే బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు....
ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు నాగులవంచ తిరుపతిరావు, మాజీ వైస్ ఎంపీపీ వజ్జ ధనుంజయ,సర్పంచులు, జక్కుల భాస్కర్,చెవ్వు రమేష్, బిఆర్ఎస్వి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు పిల్లి అభినయ్,సీనియర్ నాయకులు,కామల్ల రాములు, షేక్ సిరాజు,కూనూరు సైదిరెడ్డి, కంసాని చంటి,పోలేపల్లి యాదయ్య,వనమాల మహేందర్,బొల్లం నరేష్,కుందారపు యాదగిరి, రజనీకాంత్, కొండల్ రెడ్డి,గణేష్ మండల సీనియర్ నాయకులు,రైతులు,తదితరులు, పాల్గొన్నారు

మోడల్ స్కూల్స్ ని విద్యా శాఖ లో విలీనం చేసి 010 ద్వారా వేతనాలు చెల్లించాలి



త్రిపురారం మండలం అక్టోబర్ 30 ప్రజా న్యూస్ నెట్వర్క్ రిపోర్టర్ గాసిరాం
గత దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ నేటి నుండి దశల వారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించుటకు మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు నేడు త్రిపురారం మండలంలోని కంపసాగర్ లో గల మోడల్ స్కూల్ లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మల్లికంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడల్ స్కూల్ లను ఆంధ్రప్రదేశ్ లో చేసిన విధంగా విద్యాశాఖలో విలీనం చేసి 010 ద్వారా వేతనాలు చెల్లించాలని, అలాగే ఎంతో కాలంగా(2021 నుండి) పెండింగ్ లో ఉన్న 5 ణూా బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్, అవర్లీ బేస్డ్ టీచర్స్, వొకేషనల్ టీచర్స్ మరియు ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ నినో సవాలును సమిష్టి కృషితో ఎదుర్కొందాం..

మిర్యాలగూడ నియోజకవర్గం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అక్టోబర్ 30 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కాదు.. సమస్య రాకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే బాధ్యతాయుతమైన పాలన

రాబోయే యాసంగిలో నాగార్జునసాగర్ నుంచి సాగునీరు అందించే అవకాశం లేదు.. రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి..

కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా బి ఎల్ ఆర్ ఫౌండేషన్ ద్వారా 12 నెలల జీతాన్ని సేవా కార్యక్రమాలకు అందిస్తా

ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తేనే రాబోయే రోజుల్లో ఎదురుకానున్న ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని మిర్యాలగూడ శాసనసభ్యులు లిబత్తుల లక్ష్మారెడ్డి – పిలుపునిచ్చారు...

ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల తలెత్తే పరిస్థితులు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మిర్యాలగూడ పట్టణంలోని కళావేదికలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..

సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే, సమస్య రాకముందే అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకోవడమే బాధ్యతాయుతమైన పాలనకు నిదర్శనమని అన్నారు...

ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూ ఎం ఓ) నివేదికల ప్రకారం రాబోయే నెలల్లో ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలను, పశువులను, వ్యవసాయ రంగాన్ని కరువు పరిస్థితుల నుంచి కాపాడేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ..

ఎల్‌నినో సవాలును అధిగమించడంలో మిర్యాలగూడ నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందుండాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు...

యాసంగిలో సాగర్ నీరు అందే అవకాశం లేదు.. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 537 అడుగులకు పడిపోయిందని, డెడ్ స్టోరేజ్‌కు ఎగువన అందుబాటులో ఉన్న నీరు సుమారు 55 టీఎంసీలు మాత్రమేనని ఎమ్మెల్యే వివరించారు. ..

ఈ నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు ఇతర అత్యవసర అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు...

ఈ నేపథ్యంలో రాబోయే యాసంగి సీజన్‌లో సాగర్ నుంచి సాగునీరు అందించే అవకాశం లేదని, రైతులు ఈ వాస్తవాన్ని గుర్తించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. ..

కేవలం బోర్లపై ఆధారపడి వరి సాగు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే జొన్నలు, పెసర్లు, మినుములు తదితర ఆరుతడి పంటలను సాగు చేయాలని, అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు...

రైతు వేదికల ద్వారా వ్యవసాయ అధికారులు పంటల మార్పిడి, మార్కెట్ డిమాండ్, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నీటి లభ్యత లేదని తెలిసినా రాజకీయ స్వార్థంతో రైతులను వరి సాగు వైపు ప్రోత్సహించడం బాధ్యతారాహిత్యమని, రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని పేర్కొన్నారు. ..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలందరినీ ఆదుకునే ప్రజా ప్రభుత్వమని, రాజకీయాలకు అతీతంగా ఏ ఒక్క రైతుకూ నష్టం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు...

119 గ్రామపంచాయతీలు, 48 మున్సిపల్ వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు

మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని 198 గ్రామపంచాయతీలు, 48 మున్సిపల్ వార్డుల్లో ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ..

నీరు, విద్యుత్, భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించేలా ప్రజలను చైతన్యపరచాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, బస్టాండ్లు, జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు...

పశుగ్రాసం కొరత రాకుండా రైతులు తమ వద్ద ఉన్న పశు గ్రాసాన్ని ఇప్పుడే విక్రయించకుండా భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ చేసుకోవాలని కోరారు.

వీబీజీ రామ్‌జీ పథకం కింద వర్షపు నీటి సంరక్షణ పనులు, ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, నీటి నిల్వ నిర్మాణాలు, ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు చేపట్టాలని సూచించారు...

ప్రతి ఇంటిపై పడే వర్షపు నీటిని వృథా చేయకుండా సోక్‌పిట్లు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దామరచర్ల పెద్ద చెరువును మూసీ నది నీటితో నింపే అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు...

కరువు కాలంలో 12 నెలల జీతం ప్రజాసేవకు అంకితం

రాబోయే కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవాలనే



ఉద్దేశంతో తన 12 నెలల జీతాన్ని బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ..

వచ్చే జనవరి నుంచి ప్రజలకు తాగునీటితో పాటు పెరుగన్నం అందించే కార్యక్రమాన్ని బి ఎల్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడతామని తెలిపారు...

ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు...

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడం ఒక్క ప్రభుత్వ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ భాగస్వాములై సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ..

ముందస్తు ప్రణాళిక, నీటి పొదుపు, పంటల మార్పిడి, ప్రజల్లో అవగాహన ద్వారా రాబోయే కష్టకాలాన్ని సమర్థవంతంగా అధిగమిద్దామని అన్నారు...

గతంలో రాష్ట్రంలో 20,000 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ, ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేసి రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. మరోవైపు, దామరచర్లలో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల ప్రజలపై సుమారు రూ.40 వేల కోట్ల దీర్ఘకాలిక ఆర్థిక భారం పడిందని, 2015లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ నీటి వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేయడం ద్వారా దక్షిణ తెలంగాణకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.

అలాగే ఉపాధి కోల్పోకుండా గ్రామాల్లో సంక్రాంతి నాటికి వేల కోట్ల రూపాయలతో రహదారులు, కాలువల మరమ్మతులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు...

వికసిత్ భారత్ గ్రామీణ రోజ్‌గార్ అభియాన్ కింద 202627 సంవత్సరంలో రూ.6,311 కోట్లతో 11 కోట్ల పనిదినాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను ప్రస్తావించారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ..

ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని



అధికారులను ఆదేశించారు. ...

ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాటి నిల్వ సామర్థ్యం, ఎంతకాలం నీరు అందుబాటులో ఉంటుందనే అంశాలపై సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు నీటి వనరుల ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ..

నీటి లీకేజీలను అరికట్టి, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

వీబీజీ రామ్‌జీ పథకం కింద ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించి, నీటి నిల్వ నిర్మాణాలు, కూలీలు అధికంగా అవసరమయ్యే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు...

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు వేదికల్లో ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని, ప్రతి శుక్రవారం జరిగే రైతుల అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ..

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న, తక్కువ కాలవ్యవధిలో పండే పంటలను సాగు చేయాలని, వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని, విద్యుత్‌ను కూడా పొదుపుగా వినియోగించాలని కోరారు...

స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే పరిస్థితులు, వివిధ శాఖలు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై వివరించారు...


వ్యవసాయం, భూగర్భ జలాలు, ఉద్యానవనం, తాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేయనున్న ముందస్తు కార్యాచరణను వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు...

సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

– హుజూర్‌నగర్ పట్టణంలో విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వినతి

– మున్సిపల్ కమిషనర్ సతీష్‌కు వినతిపత్రం అందజేసిన గిరిజన నాయకులు



హుజూర్‌నగర్ పట్టణం, అక్టోబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

హుజూర్‌నగర్ పట్టణంలో అనువైన ప్రదేశంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ గిరిజన నాయకులు మున్సిపల్ కమిషనర్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. లంబాడీ బంజారా సమాజం ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించి, అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ నాయకులు బానోతు వెంకటరామ్ నాయక్, లంబాడీ జేఏసీ నాయకులు దరావత్ నరసింహ, లంబాడీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు బీటెక్ సైదా నాయక్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో గిరిజన గళం..


తండాలో నిద్ర కార్యక్రమానికి భారీ మద్దతు


– లంబాడీ బంజారా హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమం

– చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి.. మంత్రి పదవి కల్పించాలి

హుజూర్‌నగర్ నియోజకవర్గ, అక్టోబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

సేవాలాల్ సేన ఆధ్వర్యంలో చేపట్టిన ‘గిరిజన గళంతండాలో నిద్ర’ యాత్రలో భాగంగా మూడో రోజు హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి గిరిజన సంఘాలు, నాయకులు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు. ఎల్‌హెచ్‌పీఎస్, టీఆర్‌జీఎస్ గిరిజన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లంబాడీ బంజారా సోదరులు భారీ సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. సేవాలాల్ సేన నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టౌన్‌హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధనపై నాయకులు చర్చించారు. తెలంగాణలో సుమారు 40 లక్షల జనాభా కలిగిన లంబాడీ బంజారా వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రి పదవి ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, గిరిజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాల విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కుల సాధన కోసం చేపట్టిన ‘గిరిజన గళంతండాలో నిద్ర’ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగు నాయక్, బానోతు వెంకటరామ్ నాయక్, నగేష్ రాథోడ్, ధీరావత్ రవి నాయక్, గరిడేపల్లి గుగులోత్ కృష్ణ నాయక్, దారావత్ రవీందర్ నాయక్, భూక్య బాలు నాయక్, సైదా నాయక్ తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.







ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే కార్యక్రమానికి బయలుదేరిన కాంగ్రెస్ జిల్లా నాయకులు.





ప్రజా న్యూస్ అక్టోబర్ 30 (అందోల్ ప్రతినిధి మొహమ్మద్ అబేద్)

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా రేపు జరగబోయే కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్టుల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి బయలుదేరారు. ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరుగుతున్న జాతీయస్థాయి కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య అందులో నియోజకవర్గం నుండి మండలాధ్యక్షుడు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో వట్టిపల్లి మండల అధ్యక్షులు వనజాల విశ్వాస్, అందోల్ మండల్ అధ్యక్షులు గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షులు లింగన్న గారి సంతోష్ కుమార్, చౌటకూర్ మండల అధ్యక్షులు బోడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షులు మల్లన్న గారి దుర్గారెడ్డి, రాయికోడు మండల అధ్యక్షులు పట్టణ కేదార్నాథ్ పాటిల్, అందోల్ జోగిపేట టౌన్ అధ్యక్షులు డాకూరి వెంకటేశం, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు ఢిల్లీ కి బయలుదేరారు.

ఘట్కేసర్‌లో లల్లు ముదిరాజ్ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి



కుత్బుల్లాపూర్.,అక్టోబర్ 30 : ప్రజా న్యూస్ నెట్వర్క్...

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో లల్లు ముదిరాజ్ కుమారుడి వివాహ వేడుక శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ మంగళకరమైన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల, సాంకేతిక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను కలసి పవిత్ర ఆశీస్సులు అందజేశారు. వారి భావి జీవితం ఆనందమయంగా ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకలో రాష్ట్ర చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ప్రముఖనాయకులు అంబర్‌పేట్ శంకర్, మాజీ కార్పొరేటర్లు సామల హేమ, ఆగం పాండు ముదిరాజ్ తదితర ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు.
నూతన దంపతులను ఆశీర్వదించేందుకు తరలివచ్చిన బంధుమిత్రులతో వివాహ ప్రాంగణం కోలాహలంగా మారింది. ప్రముఖుల రాకతో కార్యక్రమ ప్రాంగణంలో సందడి నెలకొంది.

చెకుముకి సంబరాలను జయప్రదం చేయాలి

– విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి – చెకుముకి పోస్టర్ ఆవిష్కరించిన బచ్చు పురుషోత్తం

సూర్యాపేట జిల్లా కేంద్రం, అక్టోబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ, విజ్ఞానంపై ఆసక్తిని కలిగించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేటలోని శ్రీ వాసవి సేవా సమితి కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి చెకుముకి సంబరాల లక్ష్యాలు, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా బచ్చు పురుషోత్తం చెకుముకి సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు పాఠ్యాంశాల పరిజ్ఞానంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానం, ప్రశ్నించే తత్వం, పరిశీలనా శక్తి ఎంతో అవసరమని తెలిపారు. మూఢనమ్మకాలను తొలగించి, విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చెకుముకి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు సైన్స్‌పై ఆసక్తి, ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇలాంటి విజ్ఞాన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కలకుంట్ల సైదులు, కోశాధికారి డాక్టర్ క్రాంతి కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు గొల్లమూడి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు దేవరశెట్టి నాగరాజు, గౌరవాధ్యక్షులు తల్లాడ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగానికే రిటైర్మెంట్, సమాజ సేవకు కాదు : కోదండరాం



ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమే పరిమితమని, సమాజ సేవకు ఎలాంటి విరమణ ఉండదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. కొందరు ఉద్యోగులు కేవలం తమ విధులకు మాత్రమే పరిమితమవుతారని, అలాంటి వారికి పదవీ విరమణ వర్తించవచ్చని అన్నారు. కానీ, కొందరు ఉద్యోగ బాధ్యతలతో పాటు పలు రంగాల్లో సమాజ సేవలోనూ చురుకుగా పాల్గొంటారని, అలాంటి వారికి నిజమైన విరమణ ఉండదని చెప్పారు. జడ్చర్లలో నిర్వహించిన ఎంఈఓ మంజులాదేవి పదవీ విరమణ సన్మాన సభలో కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మంజులాదేవి వంటి వారికి పదవీ విరమణ ఉండదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎమ్మెల్సీ కేపీఎన్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎ. శేఖర్, ప్రతాప్ రెడ్డి, ఆర్జేడీ సోమిరెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు కూడా పాల్గొని మంజులాదేవికి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్ట్

ఒంటరిగా ఉన్న మహిళలే టార్గెట్.. సూర్యాపేట, కోదాడ కేసులు ఛేదించిన పోలీసులు

నేరాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ, పీడీ యాక్ట్ అమలుపై పరిశీలన : ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేట జిల్లా కేంద్రం, అక్టోబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

కిరాణా దుకాణాల్లో మహిళలు ఒంటరిగా ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 4 లక్షల విలువైన బంగారు ఆభరణాలను గుర్తించారు. ఖమ్మం పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో ఆ బంగారాన్ని కుదువ పెట్టినట్లు పోలీసులు వెల్లడించారు. శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ కేసు వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన షేక్ ఖాసీం అలియాస్ షన్ను (23), తుమ్మాటి భరత్ కుమార్ అలియాస్ భరత్ (24) ఈ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తెలిపారు. ఈ నెల 26న సాయంత్రం సూర్యాపేట శ్రీరాంనగర్ కాలనీలోని ఓ కిరాణా దుకాణంలో మహిళ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన నిందితులు సిగరెట్, వాటర్ బాటిల్, సెంటర్ ఫ్రెష్ అడిగి ఆమె దృష్టి మరల్చారు. ఇదే అదనుగా ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. ఇదే తరహాలో ఈ నెల 11న కోదాడ పట్టణంలోని కిరాణా దుకాణంలో మరో మహిళ మెడలోని సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అక్టోబర్ 29న సూర్యాపేట ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలను అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులపై గతంలో గంజాయి, దొంగతనం కేసులు కూడా ఉన్నట్లు వెల్లడించారు. అలవాటుగా నేరాలకు పాల్పడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే జిల్లా బహిష్కరణ, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు, పీడీ యాక్ట్ అమలుపై పరిశీలన చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. మహిళలు, ముఖ్యంగా దుకాణాలు నిర్వహించే వారు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ గోపికృష్ణ, రామనరసయ్య, శ్రీరాములు, కొండ రమేష్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పనిలేక తిరుగుతున్నానా? రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను : ఈటల రాజేందర్



జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు.పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. “డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా“ అని ఆయన స్పష్టం చేశారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

రక్త దాతలే ప్రాణ దాతలు

చిన్నంబావి ఎస్ఐ రామన్ గౌడ్.

చిన్నంబావి మండలం ప్రజా న్యూస్ అక్టోబర్ 30

సమాజంలో ప్రతి జీవి ప్రాణం నిలుపుకోవడానికి రక్తం ఎంతో అవసరమని, అలాంటి రక్తాన్ని దానం చేసే రక్త దాతలే ప్రాణదాతలుగా నిలుస్తారని చిన్నంబావి మండలం ఎస్సై రామన్ గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ సునీత రెడ్డి పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంకు ఆమే పిలుపు మేరకు మండల పరిధిలోని యువతను రక్తదానం చేయాలని పిలుపునివ్వగా, సుమారు 15 మంది యువత ముందుకు వచ్చారని, వారు జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ లో జిల్లా పోలీసు,రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి 15 యూనిట్ల రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలుగా నిలిచారని, ఈ విషయంలో స్థానిక ఎస్సై, యువత గౌరవ ఎస్.పి సునీత రెడ్డి ప్రశంసలు అందుకోవడం జరిగిందని ఆయన అన్నారు.
రక్తదానం చేసిన యువతకు పోలీస్ డిపార్ట్మెంట్,తెలంగాణ ప్రభుత్వ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాన్ని అందజేయడం జరిగింది.
ప్రజల కోసం,మెరుగైన సమాజం కోసం పని చేయడానికి యువతి, యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మహేందర్,వంశీ,



జర్నలిస్టులు పెరుమాళ్ళ శ్రీనివాస్, పెరుమాళ్ళ వెంకటేష్, యువకులు కనమోని శివ,మేకల అశోక్,జింకల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత



రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు.సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.